సచివాలయ సిబ్బందిపై ఆంక్షలు

- హాజరు నిబంధనల్లో మార్పు
- సర్వేల పేరుతో పని ఒత్తిడి
- ఆవేదన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కాశినాయన : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం విషం చిమ్ముతోంది. ఇప్పటికే వలంటరీ వ్యవస్థను పక్కన పెట్టేసిన కూటమి సర్కారు సచివాలయ ఉద్యోగులపై నిబంధనల పేరుతో వేధిస్తుంది. తాజాగా సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం కొత్త ఆంక్షలు విధించింది. ఖచ్చితంగా రెండు సార్లు బయోమెట్రిక్ హాజరు వేయాలని, పింఛన్ లబ్ధిదారులకు వారు ఇంటికి 300 మీటర్ల రేడియేషన్‌లోనే పింఛన్ ఇవ్వాలని నిబంధన విధించింది. దీంతో పాటు వివిధ సర్వేల పేరుతో పనిఒత్తిడి ఎక్కువైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులకు ఇంతకు ముందు ఉన్న హాజరు నిబంధనలను సడలించి కొత్త నిబంధనలను ప్రకటించింది. గతంలో బయోమెట్రిక్ విధానంలో మూడుసార్లు హాజరు వేయాల్సి ఉన్నా ఉద్యోగుల సౌలభ్యం దృష్ట్యా ఒక్కసారి బయోమెట్రిక్ వేసినా సరిపోయేది. ఒక్క బయోమెట్రిక్ హాజరు ఉన్నా ఆ రోజు పని చేసినట్లుగా పరిగణించేవారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు బయోమెట్రిక్ హాజరును సవరించి రెండు సార్లు వేసేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసింది. అయితే ఖచ్చితంగా ఉద్యోగులు రెండు సార్లు బయోమెట్రిక్ వేయాల్సిందేనని మెలిక పెట్టింది. ఉదయం వేసి సాయంత్రం వేయకపోతే ఆ రోజు సాధారణ సెలవుగా పరిగణిస్తారు. ఈ మేరకు యాప్‌లో కొన్ని మార్పులు చేసింది. డీఎస్‌డబ్ల్యూఎస్ హాజరు యాప్ వెర్షన్‌లో ఉదయం 10–30 గంటలలోపు సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే తీసుకుంటుంది. రోజుకు రెండుసార్లు బయోమెట్రిక్ లేదా ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంది. ఎవరైనా ఉద్యోగి ఉదయం ఒకసారి హాజరు నమోదు చేసి సాయంత్రం వేయకపోతే ఆ రోజు పని చేయనట్లే లెక్కగా పరిగణిస్తారు. హాజరు లెక్కను ఖజానాకు అనుసంధానం చేశారు. రెండుసార్లు హాజరు వేస్తేనే జీతం వచ్చేలా లింక్ పెట్టారని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు.



కొండ్రాజుపల్లె సచివాలయం

సచివాలయ సిబ్బంది ఆవేదన

కూటమి ప్రభుత్వం పెట్టిన కొత్త ఆంక్షలపై సచివాలయ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మామూలు సమయంలో రెండుసార్లు హాజరు వేయడానికి తమకు ఇబ్బంది లేదని, అయితే ఒక్కోసారి సర్వేల పేరుతో గ్రామాలకు వెళుతుంటామని, తిరిగి అలాంటి సమయంలో సచివాలయానికి వచ్చి హాజరు వేయడం కష్టమవుతుందని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు ఎవరికి లేని విధంగా సచివాలయ ఉద్యోగులు ఐడెంటికార్డు ధరించి విధులకు హాజరు కావాలనే నిబంధన పెట్టడంపై కూడా సచివాలయ ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వివిధ రకాల సర్వేలు పెట్టారు. ఒక సచివాలయ పరిధిలో రెండు, మూడు గ్రామాలు ఉంటాయి. ఆ సర్వేలు చేసుకుని తిరిగి సచివాలయానికి వెళ్లి హాజరు వేయాలంటే కష్టతరంగా ఉందని వాపోతున్నారు.

నియోజకవర్గంలోని సచివాలయాల వివరాలు

మండలం	సచివాలయాలు
కాశినాయన	10
కలసపాడు	11
పోరుమామిళ్ల	19
బి.కోడూరు	10
బద్వేలు మున్సిపాలిటీ	23
బద్వేలు రూరల్	9
గోపవరం	6
అట్లూరు	7
సచివాలయ ఉద్యోగులు	720 మంది

యోగనరసింహుడికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీ సత్యనారాయణ స్వామి ఆలయంలోని సుదర్శన యోగ నరసింహస్వామికి బుధవారం నరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. సుదర్శనయోగ నరసింహస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ ఆలయంలో ఒకే రాతిపై ఒక వైపు యోగ ముద్రలో నరసింహస్వామి, మరోవైపు సుదర్శన స్వామి ఉండటం విశేషం. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామివారికి కాయాకర్పూరాలను సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మండల పరిధి నరసింహాపురం గ్రామంలోని పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి ఆంజనేయస్వామి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. విశేషంగా నూతన పట్టు వస్త్రాలతో, వెండి కవచాలు, రంగురంగుల పూలు, గజమాలలు, వడ మాలతో అలంకరించారు.


ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

పశుగ్రాస క్షేత్రాలను పెంచుకోండి

ప్రొద్దుటూరు రూరల్ : వేసవిలో పాడి గేదెలకు పచ్చి మేత వేయడం వలన పాల దిగుబడి పెరుగుతుందని పశుగ్రాస క్షేత్రాలను పెంచుకోవాలని పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు ధనుంజయరెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో బుధవారం పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పచ్చి పశుగ్రాసాన్ని అధిగమించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాస పెంపక పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ పశు ఆరోగ్య శిబిరంలో 345 సాధారణ చికిత్సలు, 52 గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 173 లేగదూడలకు నట్టల నివారణ మందు, 2,584 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించారు. ఈ కార్యక్రమంలో మండల పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.


లేగదూడకు నట్టల నివారణ మందు తాపిస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీఏ ధనుంజయరెడ్డి

నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

ప్రొద్దుటూరు రూరల్ : వ్యవసాయ శాఖ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని వ్యవసాయ సహాయ సంచాలకులు సురేష్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి కలిగిన ఎరువులను మాత్రమే రైతులకు నిర్ణీత ధరలకు విక్రయించాలన్నారు. ఎరువుల దుకాణాల యజమానులు విక్రయించిన ప్రతి బస్తాకు నగదు బిల్లులను రైతులకు ఇవ్వాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఫారం 'ఓ' అనుమతి కలిగిన వాటిని మాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు. ఎరువుల బస్తాల్లో తూకాల్లో అవకతవకలు ఉండకూడదన్నారు. ఎరువల డీలర్లు లైసెన్స్, గోడౌన్ అనుమతి కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎరువుల ధరలను నోటీసు బోర్డులో ప్రకటించాలన్నారు. అనంతరం ఎరువుల దుకాణాల నుంచి శాంపిల్స్‌ను సేకరించి కడపకు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు సురేష్‌రెడ్డి

ప్రకృతి వ్యవసాయమే లాభదాయకం

అట్లూరు : ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకమని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. కమలకూరు రైతు సేవాకేంద్రం పరిధిలోని వలసపాళెం గ్రామంలో వెంకటసుబ్బమ్మ అనే మహిళా రైతు తయారు చేసిన ఘన జీవామృతాన్ని పరిశీలించారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడితే దిగుబడి పెరుగుతుందన్నారు. కానీ రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతుండటంతో భూమి బండబారి పోతోందని, నేలలోని మిత్ర పురుగులు కూడా చనిపోయి తెగుళ్లు ఎక్కువవుతున్నాయని వివరించారు. అనంతరం కామసముద్రం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మొక్కజొన్న పంటల యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు అరుణ, సందీప్, అనుషా, రైతులు పాల్గొన్నారు.

బి.కోడూరు : మండలంలోని రామసముద్రం, బి.కోడూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి కౌశిక వరిపంట పొలాలను పరిశీలించి సస్యరక్షణ చర్యలు, ఎరువుల వాడకం గురించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. వ్యవసాయశాఖ సిబ్బంది వినోద్, రైతులు పాల్గొన్నారు.


అట్లూరు : ఘన జీవామృతాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

కలసపాడులో 'పొలం పిలుస్తోంది'

కలసపాడు : మండలంలోని కలసపాడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రొద్దుటూరు : ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రాజారామ్మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని గోపవరం గ్రామంలో ఉన్న ఎంపీయూపీ పాఠశాలలో వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో అభిష్ట ఇన్‌ఫ్రా డైరెక్టర్ మెట్టుపల్లి అనురాధ సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజారామ్మోహన్‌రెడ్డి 50 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు, పాఠశాల హెడ్మాస్టర్ జీపీ దస్తగిరి, వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు జి.రామాంజనేయరెడ్డి, ఎం.శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజారామ్మోహన్‌రెడ్డి

దేశరక్షణలో యువత ముందుండాలి

బద్వేలు అర్బన్ : దేశరక్షణలో యువత ముందుండాలని, ఇందుకోసం ఎన్‌సీసీలోని వివిధ విభాగాలు ఎంతగానో ఉపయోగపడతాయని రూరల్ సీఐ ఎం.నాగభూషణ్ పేర్కొన్నారు. స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ నావల్ విద్యార్థులకు బుధవారం కొంగలవీడు సమీపంలోని సగిలేరులో నిర్వహించిన బోట్ సైలింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన 10(ఎ) నావల్ యూనిట్ అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ బద్వేలు లాంటి అభివృద్ధి చెందుతున్న పట్టణంలో దేశరక్షణ రంగంలో పనిచేయాలనుకునే ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం నాగభూషణం డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ నావల్ విభాగాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. విద్యార్థులు కష్టపడి శిక్షణ పూర్తి చేసుకుని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ కె.శ్రీకాంత్, కళాశాల పరిపాలనాధికారి రాచపూడి వెంకటసాయిక్రిష్ణ, ఎన్‌సీసీ 10(ఎ) నావల్ అధికారులు భూపేంద్రకుమార్, లోకేష్, కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు.


బోట్ సైలింగ్‌ను ప్రారంభిస్తున్న రూరల్ సీఐ

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

మైదుకూరు : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మదీనా దస్తగిరి ప్రకటించారు. బుధవారం దస్తగిరిని వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం మరింత ఉత్సాహంతో పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ నూరుల్లా, జమ్మలమడుగు నూర్ బాషా సంఘం వైస్ ప్రెసిడెంట్ బెల్లం కొండ దస్తగిరి, రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.


మదీనా దస్తగిరిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హామీలను విస్మరిస్తున్న 'కూటమి'

పోరుమామిళ్ల : కూటమి ప్రభుత్వం హామీలను విస్మరిస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఆయన పోరుమామిళ్లలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని కలసి మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎదుర్కొనేందుకు పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేయాలని పేర్కొన్నారు. ఈ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు రాజీవ్‌బాషా,ఆర్గనైజేషనల్ సెక్రెటరీ నరసింహులు, చాపాటి నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ రవిచంద్రారెడ్డి, నాయకులు సాయినారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, హరి చంద్రారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పార్టీ పురోభివృద్ధికి కృషి చేయండి

ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపు

బద్వేలు అర్బన్ : ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వైఎస్సార్‌సీపీ పురోభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీగా, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడుగా నియమితులైన తోటనా గేశ్వర్‌రావు, నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ఎన్‌జీఓ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం లభిస్తుందని అన్నారు. వివిధ పదవుల్లో నూతనంగా నియమితులైన వారు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, పుత్తాశ్రీరాములు, యద్దారెడ్డి, పుల్లయ్య, కౌన్సిలర్ సత్యం, చెన్నకృష్ణారెడ్డి, రఘురామిరెడ్డి, సుబ్బారెడ్డి, రెడ్డెయ్య, వేణు, ఉప సర్పంచ్ రవి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సుధను సత్కరిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే నివాళి

అట్లూరు : అట్లూరు మండల పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన మామిడి ఓబుల్‌రెడ్డి (60) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ బుధవారం కొండూరు వెళ్లి ఓబుల్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం ఆమె ఓబుల్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రాజారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, చిన్నగోపాల్ రెడ్డి, ఇండియన్ పెట్రోల్ బంకు అధినేత చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న 65 మంది మహిళా పారిశుద్ధ్య కార్మికులకు కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. సత్యనారాయణ మాట్లాడుతూ వారం రోజుల్లో జీతాలు ఇవ్వకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, రాఘవేంద్ర, కళావతి,రత్నమ్మ, లక్ష్మీదేవి, దుర్గాదేవి పాల్గొన్నారు.

నేడు సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష

ప్రొద్దుటూరు కల్చరల్ : కొర్రపాడు రోడ్డులోని పీఎన్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఉదయం 10 గంటలకు నేతాజీ సోషల్ స్టడీస్ క్లబ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు గురుకుమార్, కన్వీనర్ భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

నిర్లక్ష్యంగా వాహనాలు నడపవద్దు


ప్రొద్దుటూరు క్రైం : నిర్లక్ష్యంగా వాహనాలను నడిపి ప్రమాదాల పాలై కుటుంబాలను రోడ్డు పాలు చేసుకోవద్దని ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం ఇంజినీరింగ్ విద్యార్థులతో రాజీవ్ సర్కిల్ నుంచి వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ బైక్ నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, త్రిబుల్ రైడింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు జరగవని చెప్పారు. ట్రాఫిక్ సీఐ దేవకిరణ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే యువకులే ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. యువకులు, విద్యార్థులు హెల్మెట్ ధరించకుండా ఓవర్ స్పీడ్‌తో వెళ్లడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ నరసింహులు, ఎంవీఐలు నారాయణనాయక్, హేమకుమార్, రవీంద్రనాయక్, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్, శ్రీనివాసరెడ్డి, ఏఓ కరిముల్లా, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీకర్‌రెడ్డి, సీబీఐటీ, ఎస్ఆర్ఐటీ, వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బద్వేలు అర్బన్ : ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా జీఈ విండ్‌పవర్‌మిల్స్ సహకారంతో బుధవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలి

కలసపాడు : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించి అందులో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలసపాడులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో 292 ఉన్నత పాఠశాలల్లో ప్లస్‌టూ తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. అందులో సుమారు 1,850 మంది స్కూల్ అసిస్టెంట్లు ఒక అదనపు ఇంక్రిమెంట్‌తో పీజీటీలుగా పని చేస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ప్లస్‌టూలను రద్దు చేస్తే గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు డ్రాపౌట్లుగా మారి ఉన్నత విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌బాబు, పి.రమణారెడ్డి, సి.వెంకటరెడ్డి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.రమణారెడ్డి

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

బద్వేలు అర్బన్ : బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 9 మండలాల్లోని తహసీల్దారు కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న అటెండర్, డ్రైవర్, వాచ్‌మెన్ పోస్టులను అర్హులైన గ్రామ రెవెన్యూ సహాయకులతో భర్తీ చేయాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు ధైర్యం, ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గుర్రాలహరికృష్ణ పేర్కొన్నారు.

క్లుప్తంగా

లేగదూడల ప్రదర్శన

పోరుమామిళ్ల : మండలంలోని క్రిష్ణంపల్లెలో బుధవారం రాష్ట్రీయ గోకుల్‌మిషన్ పశుసంవర్ధకశాఖ, ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో 58 లేగదూడలు పాల్గొన్నాయి. ఆరోగ్యంగా ఉండే దూడలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక అధికారిణి డాక్టర్ శారదమ్మ మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల మిషన్ ద్వారా అమలవుతున్న కృత్రిమ గర్భాధారణను వినియోగించుకుని మేలుజాతి దూడలు ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. సహాయ సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ దూడల యాజమాన్య పద్ధతులు, లేగదూడల సంరక్షణ, గర్భకోశ వ్యాధులు, లింగనిర్ధారణ వీర్యం వలన ఉపయోగాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కడప డీఎల్‌డీఏ శివరామిరెడ్డి, పశువైద్యులు శివశ్రీనివాసరెడ్డి, శరత్, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు డీలర్ల ఎంపికకు రాత పరీక్ష

ప్రొద్దుటూరు : రేషన్ డీలర్ల నియామకానికి సంబంధించిన రాత పరీక్షను శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 17న రాత పరీక్షను నిర్వహించాల్సి ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన కారణంగా వాయిదా వేశారు. 24న మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. మండలానికి సంబంధించి 73 మంది నిరుద్యోగులు ఆయా డీలర్ల షాపుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు.

మున్సిపల్ అధికారులకు మెమోలు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని మోడంపల్లెలో బ్రహ్మకుమారీస్ ఓంశాంతి భవనం నిర్మాణంపై మున్సిపల్ అధికారులకు చార్జి మెమోలు జారీ చేశారు. అనుమతులు లేకుండా ఈ భవనాన్ని నిర్మించారని ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు చార్జి మెమోలను జారీ చేశారు. గతంలో పనిచేసిన మున్సిపల్ మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఏసీపీ సువర్ణ, టీపీఓ ఇందిర, వార్డు ప్లానింగ్‌సెక్రటరీ షంషాద్ బేగంకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ నిర్మాణానికి సంబంధించి 15 రోజుల్లోపు వివరణ ఇవ్వాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. శ్రీ రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి, కాశీ అన్నపూర్ణాదేవి సమేత హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయాల్లోని హుండీలను లెక్కించగా 18 నెలలకు గాను భక్తులు కానుకల రూపంలో రూ.6,51,240 సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీధర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం విజయవంతం

చాపాడు : మండల పరిధిలోని చెంచుపల్లె గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం విజయవంతమైనట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ గౌస్ తెలిపారు. ఈ శిబిరంలో 9 పశువులకు చూడి పరీక్షలు, 11 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 48 దూడలు, 186 పెద్ద పశువులకు, 480 జీవాలకు నట్టల నివారణ మందు తాపించారు. 26 పశువులకు సాధారణ, 4 పశువులకు కృత్రిమ గర్భధారణ పరీక్షలు చేసినట్లు పశు వైద్యాధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, చలపతి, మహబూబ్ బాషా, హుస్సేన్, విష్ణుప్రియ, అమర్నాథ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

పోరుమామిళ్ల : హైదరాబాదు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు పోరుమామిళ్ల నుంచి బాలుర విభాగంలో అబ్దుల్ అజీద్, చరణ్ బాలికల విభాగంలో లోక్షిత, సాయిప్రీతి ఎంపికైనట్లు మాస్టర్ నాయబ్ చెప్పారు. క్రీడాకారులను బుధవారం ఎస్ఐ కొండారెడ్డి అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్‌లు ఉస్మాన్, సుభాష్, గోవర్ధన్, ఆంజనేయులు, సీనియర్ క్రీడాకారులు రోషన్, కాశిబాబా పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

-డీఎస్పీ పుతి భావన

ప్రొద్దుటూరు క్రైం : శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని డీఎస్పీ పుతి భావన అన్నారు.


బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ పుతి భావన

ప్రొద్దుటూరు నూతన డీఎస్పీగా ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ భావన మాట్లాడుతూ ఆర్థిక నేరాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచి వాటి కట్టడికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సబ్ డివిజన్‌లోని సీఐలు బాలమద్దిలేటి, యుగంధర్, రామకృష్ణారెడ్డి, దేవకిరణ్, గోవిందరెడ్డి, ఎస్ఐలు నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ భావనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.